సాక్షి
పల్నాడు
శుక్రవారం। 17। మార్చి। 2023




వేసవి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్

గుంటూరు వెస్ట్: వేసవిని ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని జేసీ జి.రాజ కుమారి తెలిపారు. సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీసీలో ఆమె మాట్లాడారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,500 వరకు పలికింది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ 42.9635 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

జనాకర్షక బడ్జెట్

- నవరత్నాలకు పెద్దపీటతో జిల్లాలోని పేదలకు సంక్షేమ ఫలాలు
- రైతులకు అండగా నిధుల కేటాయింపు
- కృష్ణా డెల్టా ఆధునికీకరణకు పెద్ద ఎత్తున నిధులు
- పులిచింతలకు భారీ కేటాయింపులు
- పరుగులు పెట్టనున్న వ్యవసాయ రంగం
- పారిశ్రామిక ప్రగతికి ఊతం
- అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్

ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023–24 రాష్ట్ర బడ్జెట్ జన రంజకంగా సాగింది. ఈ పద్దులో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు పెద్ద పీట వేశారు. వ్యవసాయాధారిత పల్నాడు జిల్లాలో కృష్ణా డెల్టా ఆధునికీకరణకు, పులిచింతల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం.. పారిశ్రామిక రంగంలో పరుగులు పెడుతున్న జిల్లాకు మరింత ఊతమిచ్చేలా భారీగా నిధులు సమకూర్చడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సాక్షి, నరసరావుపేట: వార్షిక బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు పెద్ద పీట వేశారు. ప్రధానంగా సాంఘిక సంక్షేమం సంబంధించి ఎక్కువ నిధులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉండటం వలన వారి సంక్షేమానికి నిధులు ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు కాపు, బ్రాహ్మణ, బీసీ కార్పొరేషన్‌లకు అత్యధిక ప్రాధాన్యతను బడ్జెట్‌లో ఇచ్చారు. రైతాంగంపై అధికంగా ఆధారపడిన పల్నాడు జిల్లాలో రైతు సంక్షేమ కోసం అధిక నిధులు కేటాయించారు. ముఖ్యంగా రైతు భరోసా ద్వారా సుమారు 2.66 లక్షల మంది రైతులకు రూ.380 కోట్లకు పైగా లబ్ధి కలగనుంది. యంత్రీకీకరణ, పాడి రైతులకు ప్రోత్సాహకాలు వంటివి జిల్లాలోని రైతులకు దక్కనున్నాయి. మరోవైపు పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం.. ఇటీవల వైజాగ్ పెట్టుబడిదారుల సమ్మిట్‌లో ఒప్పందాల నేపథ్యంలో పల్నాడులో మరింత పారిశ్రామిక అభివృద్ధి జరగనుంది. సిమెంట్ పరిశ్రమల్లో సుమారు రూ.6000 కోట్లు, పర్యాటకరంగంలో రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాగునీటి రంగంలో కృష్ణా డెల్టా వ్యవస్థకు రూ.202.61 కోట్లు, పులిచింతలకు రూ.22.67 కోట్లు కేటాయించారు. సర్వ జనాకర్షకంగా ఉన్న బడ్జెట్‌పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బడ్జెట్ అన్నివర్గాల అభివృద్ధికి అద్దం పట్టేలా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల అభివృద్ధికి అద్దం పట్టేలా ఉంది. వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. సంక్షేమానికి భరోసా నిచ్చేలా ఉంది. ఏ రంగానికి ఎంత ఇవ్వాలో ఆ మేరకు ముఖ్యమంత్రి ఆ రంగానికి తగినంతగా నిధులు కేటాయించారు. బడ్జెట్ సామాజిక విప్లవాన్ని ప్రతిబింబిస్తోంది. సంక్షేమ పథకాలకు కొరత లేకుండా తగినన్ని నిధులు కేటాయించారు.

– మేరుగ నాగార్జున,
సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

రైతు అనుకూల బడ్జెట్



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని మరోసారి నిరూపించేలా బడ్జెట్ ఉంది. రైతుల సంక్షేమానికి, పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కేటాయింపులు ఉన్నాయి. జగనన్న మానస పుత్రిక ఆర్‌బీకేలను పటిష్టం చేయడం, యాంత్రీకీకరణ, పాడిరైతులకు మేలు చేసేలా బడ్జెట్ ఉంది.

– ఎల్.గోవిందరెడ్డి,
ముప్పాళ్ళ, సత్తెనపల్లి నియోజకవర్గం

సామాన్యులకు అనుకూలం



సామాన్యులకు అనుకూలంగానే ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు ప్రతి అంశంలో ప్రతిబింబించింది. పేదలందరికి గృహాల కోసం రూ.5,600కోట్లు, మనబడి నాడు–నేడు కోసం రూ.3,500కోట్లు, ధరల స్థిరీకరణ కోసం రూ.3000కోట్లు, వైద్య,ఆరోగ్యశాఖకు రూ.15,882కోట్లు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

– కొత్తూరి కిషోర్‌బాబు, అధ్యక్షుడు,
చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ

మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట



సచివాలయ వ్యవస్థ పటిష్టత కోసం బిల్లులను తీసుకొచ్చారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని తీసుకొచ్చినట్లుగానే అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని తీసుకురావటం ఆయా ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. మున్సిపాలిటీల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. మెరుగైన మౌలిక వసతులు కల్పన జరగనుంది.

– కె.కమలాకర రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్

రాష్ట్రాభివృద్ధికి దోహదం



బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యవసాయం, వాణిజ్య రంగాలతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. విశాఖలో నిర్వహించిన సమ్మిట్ ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం పడింది.

– కేపీ రంగారావు,
రాష్ట్ర కార్యదర్శి, ఏపీ డ్రగ్స్ అసోసియేషన్

అన్నిరంగాల అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లోనూ వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, కోవిడ్ కష్టాలు ఉన్నా ప్రభుత్వం పై రంగాలకు నిధులు క్రమం తప్పకుండా ఇస్తోంది. వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో తీర ప్రాంతం అధికంగా ఉంది. మొదటి దశలో ప్రభుత్వం నాలుగు పోర్టులను నిర్మించనుంది. మలిదశలో మరిన్ని పోర్టులను నిర్మించబోతోంది. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

– మోపిదేవి వెంకటరమణారావు,
రాజ్యసభ సభ్యుడు

సంక్షేమ బడ్జెట్



2023–24 వార్షిక బడ్జెట్ ముఖ్యంగా పేదలకు అండగా నిలిచేలా ఉంది. సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయింపులు జరగడంతో ఆయా వర్గాలకు భరోసా కలిగించింది. పేదల సంక్షేమానికి ఢోకా లేకుండా నిధులు కేటాయింపు జరిగింది. సుస్థిరాభివృద్ధి, సుపరిపాలన రెండు అంశాలకు పెద్దపీట వేశారు.

– ఎస్.శ్రీహరి,
అర్థశాస్త్రం అధ్యాపకుడు, నరసరావుపేట

మహిళల పథకాలకు భారీగా నిధులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి మహిళా పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజా బడ్జెట్‌లో సైతం మహిళల పథకాలకు భారీగా నిధులు కేటాయించడం సంతోషకరం. జెండర్ పరంగా చూస్తే ఆడవారికి ఎక్కువగా లబ్ధి కలిగేలా ఉంది. ఇది మహిళాధిక్య బడ్జెట్.

– వై.శ్రీలక్ష్మి, గృహిణి, నరసరావుపేట

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు త్యాగం అమరం



నరసరావుపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీపీఓ భాస్కర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా డీఈఓగా శామ్యూల్



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిగా కె.శామ్యూల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శామ్యూల్‌ను డీఈఓగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఈఓగా పనిచేసిన ఎం.వెంకటప్పయ్యను ఉపాధ్యాయులతో అనుచితంగా ప్రవర్తించాడనే కారణంతో బదిలీ చేశారు. ప్రస్తుతం కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈఓగా వ్యవహరిస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో పూర్తి బాధ్యతలతో శామ్యూల్‌ను డీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మిరప, పసుపు రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొరిటిపాడు(గుంటూరు): నేటి నుంచి మూడు రోజుల పాటు అధిక వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ సూచించిందని, మిర, పసుపు రైతులు కోతలు కోయవద్దని జిల్లా ఉదాన అధికారి ఎస్.సుజాత గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలు, పసుపు కొమ్ములను సిల్పాలిన్, టార్పాలిన్ పరదాలతో కప్పుకొని తగు జాగ్రత్తలు చేసుకోవాలని కోరారు. ఎండబెట్టిన మిరప కాయలు, తయారైన పసుపును జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలలో నిల్వ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ఆగిన తర్వాత మాంకోజెట్, బావిస్టిన్ కలిపిన మందును 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే తాలు కాయలు రాకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు.

యార్డులో 1,18,750 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,20,879 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,18,750 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 88,685 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా పరిధిలో 13051 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 12,714 మంది హాజరైనట్లు జిల్లా వృత్తివిద్య శాఖాధికారి నీలావతి దేవి తెలిపారు. 337 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రెండో సెప్టిక్ ట్యాంకు ఏర్పాటుతో ఉపయోగాలు

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: గ్రామాల్లో ప్రతీ ఇంటికి రెండో సెప్టిక్ ట్యాంక్ తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, మురుగునీటి పారుదలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటే పెరటి తోటల పెంపకాలకు ఆ నీరు ఉపయోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఐటీసీ బంగారు భవిషత్తు – సెర్ప్ సంస్థ ఏర్పాటు చేసిన స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ స్టాల్స్‌ను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. ప్రోగ్రామ్ మేనేజర్ గౌరీనాయుడు జిల్లాలోని పలు గ్రామాల్లో ఐటీసీ సంస్థ ద్వారా చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన పలు రకాల ప్రదర్శనలను కలెక్టర్‌కు వివరించారు. ఐటీసీ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సంకల్ప్ ఘన వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవడానికి ఐటీసీ, సెర్ప్ సంస్థల ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐటీసీ – సెర్ప్ సంస్థల సేవలను అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కో – ఆర్డినేటర్ గోపాలకృష్ణ, డీపీఆర్‌సీ పద్మాకర్, ఐటీసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, సెర్ప్ సంస్థ ప్రతినిధులు కృష్ణ, శ్రీనివాస్, మండల పరిషత్ అధికారులు, విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, అధికారులు, ఐటీసీ ప్రతినిధులు

కలెక్టర్ శివశంకర్ పల్లెనిద్ర

వెల్దుర్తి: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ గురువారం రాత్రి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను, భోజన శాలను పరిశీలించారు. విద్యార్థినులు కష్టపడి చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం పక్కన ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పల్లె నిద్రకు ఉపక్రమించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ ఎ.సురేష్, డీటీ బ్రహ్మయ్య, పాఠశాల హెచ్ఎంలు పద్మ, నాగ రాజకుమారి, విద్యార్థినులు, సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇద్దరు బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డలు

మార్టూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత తన ఇద్దరు బిడ్డలతో సహా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం మార్టూరులోని రాంజనార్దన్ కాలనీలో జరిగింది. 108 సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కాలనీకి చెందిన కుంభా గోపి, లక్ష్మి దంపతులు. వీరికి ఏడేళ్ల దీక్షిత, మూడేళ్ల వయస్సుగల ఆశిష్ అనే ఇద్దరు సంతానం ఉన్నారు. గత మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒకే ఇంట్లో ఉంటున్నా గోపి తన భార్య లక్ష్మితో మాట్లాడటం లేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మి పురుగుల మందు, పెట్రోల్ కలుపుకొని తనతో పాటు తన బిడ్డలకు తాగించింది. ఇది గమనించిన సమీప బంధువులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రాణం.. తృణప్రాయం

నష్టపరిహారానికి తిలోదకాలు

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా రూ.300 కూడా చేయని సరుకులను రూ.3వేల విలువైనవంటూ ఊదరగొట్టారు.. మహిళలను రప్పించారు.. పంచేటప్పుడు వీడియోల్లో ఎక్కువ మంది కనిపించాలనే ప్రచారకాంక్షతో ఇరుకు స్టాళ్ల ఏర్పాటు చేసి ముగ్గురు అమాయకులైన మహిళల మృతికి కారకులయ్యారు.. బాధిత కుటుంబాలకు రూ.20లక్షలు నష్టపరిహారం ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించారు.. తీరా ముఖం చాటేశారు.. పేదల జీవితాలతో చెలగాటమాడడమే కాకుండా ఇస్తామన్న పరిహారం కూడా ఇవ్వకుండా పరిహాసమాడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఉయ్యూరు ఫౌండేషన్‌పై మండిపడుతున్నారు.

ముఖం చాటేసిన ఉయ్యూరు ఫౌండేషన్ శ్రీనివాస్

- చంద్రన్న కానుకల పంపిణీ పేరుతో హడావుడి
- తొక్కిసలాటలో ముగ్గురు మృతి
- ఒక్కొక్కరికి రూ.20 లక్షలు నష్ట పరిహారం ఇస్తానని ప్రకటన
- బాధితులకు ఇప్పటివరకు అందని సాయం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తన రాజకీయ అరంగేట్రం కోసం ముగ్గురిని బలితీసుకున్న ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ వారికి ఇచ్చిన హామీ మూడు నెలలు అయినా అమలు చేయకపోవడంపై బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన చంద్రన్న కానుక, అన్నగారి జనతా వస్త్రాల పేరుతో గుంటూరులో భారీ సభ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికి రూ.3వేలు విలువైన కానుకలు ఇస్తామని ఇంటింటికి తిరిగి జనసమీకరణ చేసి చివరికి చిరుగులు పడిన చీరలు...పురుగులు పట్టిన కందిపప్పు...నీరు గారుతున్న ఉల్లిపాయలు, పనికిరాని బెల్లంముక్క...ఎండిన చింతపండు చంద్రన్న కానుక పేరుతో ఇచ్చే ప్రయత్నం చేశారు. వీటి విలువ మూడు వేలు కాదు కదా మూడు వందలు కూడా చేయదు.

పత్తాలేని ఉయ్యూరు ఫౌండేషన్ శ్రీనివాస్..

ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడిని పిలిచి ప్రచార ఆర్భాటం కోసం ఉచితంగా సరుకులు పంపిణీ చేస్తున్నామని పేదలను కాలనీల నుంచి ఆటోలు పెట్టి తరలించారు. అదేవిధంగా ప్రజలకు టోకెన్‌లను పంపిణీ చేశారు. చంద్రబాబు మీటింగ్‌కు ముందే చీరెలు పంపిణీ చేస్తే జనాలు కనిపించరని ఆలస్యంగా పంపిణీ చేస్తే జనాలు వచ్చారని ప్రచారం చేసుకోవచ్చని ప్లాన్ చేశారు. ఈ ప్లాన్ కాస్తా వికటించి తొక్కిసలాట జరిగి ముగ్గురు మహిళలు మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో మహిళలు గాయపడ్డారు. తొక్కిసలాట జరిగిన వెంటనే ఉయ్యూరు ఫౌండేషన్ నుంచి మరణించిన వారికి ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు నష్టపరిహారం ఇస్తానంటూ ప్రకటించారు. గాయపడిన వారికి అయ్యే ఆస్పత్రి ఖర్చులన్నీ భరిస్తానని హామీ ఇచ్చారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలు ప్రకటించి మరుసటిరోజున అందజేసింది. టీడీపీ రూ.5లక్షలు, ఇతర నాయకులు మరో రూ.4లక్షలు ప్రకటించారు. గాయపడిన వారికి తలో రూ.50వేలు ఇవ్వనున్నట్లు నేతలు, తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. కానీ గాయపడిన వారికి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ నుంచి మాత్రమే వారికి సాయం అందింది. రూ. 20 లక్షలు ఇస్తానన్న ఉయ్యూరు శ్రీనివాస్ మాత్రం అడ్రస్ లేరు. తనపై కేసు నమోదు అయ్యిందని, ఫిర్యాదుదారుడు ఆ కేసును వెనక్కి తీసుకుంటేనే నష్టపరిహారం ఇస్తానని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. మొదట్లో బిజీగా ఉన్నామని చెప్పిన వారు తర్వాత అసలు ఫోన్లు ఎత్తడం మానేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.



తొక్కిసలాట అనంతర దృశ్యం (ఫైల్)

ఇప్పటివరకు ఏ సాయం అందలేదు..



తొక్కిసలాటలో మా కుమార్తె సయ్యద్ ఆసియా చనిపోయి, సుమారు రెండు నెలలకు పైమాటే.. కన్న కుమార్తె జ్ఞాపకాలు ఇప్పటికీ మమ్మల్ని వెంటాడుతూనే ఉన్నాయి. కొత్త సంవత్సరం వేళ.. ఆ రోజు చీరల పంపిణీకి వెళ్తున్నానని వెంటనే వచ్చేస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అవే ఆఖరి మాటలు.. ఆఖరి చూపు. మా కుమార్తె మరణించాక మనవడు నజీర్‌బాషా, మనవరాలు నస్రీమా నా వద్దనే ఉంటున్నారు. గతంలో కుమార్తె ఉన్న ఇంటికి అద్దె చెల్లించే స్తోమతలేక ఇరుకు ఇంట్లోనే అందరం కలిసి ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, పలువురు ఆర్థికంగా చేయూత అందించారు. అయితే చంద్రన్న కానుకల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉయ్యూరు ఫౌండేషన్ నుంచి ఇప్పటివరకూ ఏసాయం అందలేదు.

– రహంతున్నీసా, మృతురాలు ఆసియా తల్లి

టీడీపీ నాయకులు ఆదుకోలేదు



తోపులాటలో నా రెండు కాళ్లు గేటులో ఇరుక్కుపోయాయి. చికిత్స అనంతరం ఇంటికి వచ్చాను. అప్పటి నుంచి ఆరోగ్యం బాగోలేదు. గతంలో పాచిపనులకు వెళ్లేదాన్ని. ఇప్పుడు ఇంటి వద్దనే ఉంటున్నాను. ప్రభుత్వం ప్రకటించిన రూ.50వేలు అందాయి. టీడీపీ నాయకులు ఇస్తామన్న పరిహారం ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– కమాధుల సరోజని, తుఫాన్ నగర్

అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాం



తోపులాటలో శరీరం ఇనుప బారికేడ్లకు ఒత్తుకు పోయింది. ఒక దశలో ప్రాణాలు పోతున్నాయనుకున్నాను. అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాను. గతంలో బండి నెట్టుకుంటూ అమ్మకానికి వెళ్లేదాన్ని. ఇప్పుడు ఒక్కదాన్నే వెళ్లలేక నా కుమారుడి సహాయంతో తప్పని పరిస్థితుల్లో వెళుతున్నాను. టీడీపీ నాయకులు ఇస్తామన్న సహాయం ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– తెల్లమేకల మంగమ్మ, శ్రీకృష్ణదేవరాయ నగర్

మాట తప్పిన టీడీపీ నేతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తామన్న రూ.50వేలు అందాయి. టీడీపీ నాయకులు ఇస్తామన్న సహాయం నేటికీ ఇవ్వలేదు. నాకు నడుముకు దెబ్బతగిలింది. ఇప్పటికీ నడుము నొప్పులతో బాధపడుతున్నాను. టీడీపీ వారికి మాట తప్పడం మామూలే.

– తెల్లమేకల రంగాదేవి, భాగ్యనగర్

కమిటీ నివేదిక వచ్చాక చార్జిషీట్

తొక్కిసలాటపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఆ నివేదిక ఆధారంగా చార్జిషీట్ వేస్తాం. దీనిపై కేసు నమోదు చేసినా ఆ రిమాండ్ రిపోర్టును న్యాయమూర్తి తిరస్కరించినందున కమిటీ నివేదిక వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో చార్జిషీట్ వేస్తాం.

– బత్తుల శ్రీనివాసరావు, నల్లపాడు సీఐ

క్లుప్తంగా

అటవీ భూముల రీ-సర్వే సక్రమంగా చేయండి

అటవీశాఖల అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకం కింద అటవీ భూముల రీ-సర్వే సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఫారెస్టు కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు, ఇతర అధికారులతో పలు అంశాలపై సమీక్ష చేశారు. ఆర్వోఎఫ్ఆర్2006 చట్టం కింద అర్హులైన గిరిజనులకు అటవీ భూములకు పట్టాలు జారీ, అటవీ ఆక్రమణలు, ఫారెస్టు-రెవెన్యూ శాఖల మధ్య భూముల సరిహద్దు వివాదాలు, అటవీ భూములకు సర్వే నెంబర్లు జారీచేయుట, అటవీ పోరంబోకు వివరాలను నమోదు తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు వివరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు ఆల్బమ్‌ను అటవీశాఖాధికారి కలెక్టర్‌కు అందజేశారు.

19న సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

గుంటూరువెస్ట్ (క్రీడలు): శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19న తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని స్టెప్ సీఈఓ పల్లవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన జట్టు ఈనెల 23 నుంచి 26 వరకు హరియాణాలో జరగనున్న 69వ సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు పంపిస్తామన్నారు.

అండర్-17 బాలబాలికల చెస్ పోటీలు

జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న ద్వారకా కృష్ణ రెయిన్ ట్రీ పార్క్‌లో అండర్-17 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షులు సీహెచ్. రవీంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 79816 64035 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటు

- చింతలతండాలో యువకుడు మృతి
- మరొకరికి స్వల్ప గాయాలు
- 72 గొర్రెలు మృతి

విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగార్జున సాగర్ విమానాశ్రయం సమీప పొలంలో గురువారం పిడుగుపాటుకు రమావత్ సైదానాయక్(17) మృతిచెందాడు. అతనితోపాటు మరో 46 మేకలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళితే.. చింతలతండా గ్రామానికి చెందిన రమావత్ రతన్‌నాయక్ తన కుమారుడు సైదానాయక్‌తో కలిసి, బంధువు మన్నానాయక్ 150 మేకలను తీసుకొని మేపేందుకు పొలాల వైపు వెళ్లారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడం ప్రారంభమైంది. మేకలను తోలుకొని ఓ వేపచెట్టు కిందకు చేరారు. మేక ఈనటంతో సైదానాయక్ తండ్రి రతన్‌నాయక్ చెట్టు దాటి కొంతదూరం వెళ్లాడు. ఒక్కసారిగా పిడుగు పడటంతో సైదానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మన్నానాయక్ స్వల్పగాయాలతో స్పృహ తప్పి పడిపోయాడు. రతన్‌నాయక్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సోమ్లా నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సైదానాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



చింతలతండాలో సైదానాయక్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



రెంటాల గ్రామ శివార్లోని పంటపొలాలలో మృతి చెందిన జీవాలు

రెంటాలలో 26 జీవాలు మృతి

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామ శివార్లోని పంటపొలాల్లో గురువారం పిడుగుపడి 26 జీవాలు మృత్యువాతపడ్డాయి. రెంటచింతల గ్రామంలోని రేగులమాన్యం కాలనీకి చెందిన వీర బోయిన లింగయ్య 26 జీవాలు (గొర్రెలు) తీసుకుని పశుగ్రాసం కోసం రెంటాల గ్రామ పంటపొలాలకు వెళ్లాడు. వాతావరణంలో ఆకస్మికంగా మార్పు వచ్చి పిడుగు పడటంతో పొలంలో ఉన్న 26 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2.50 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు లింగయ్య వాపోయాడు. జీవాలపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

పాముకాటుకు గురై మహిళా కౌలురైతు మృతి



విజయలక్ష్మి మృతదేహం

నాదెండ్ల: పాముకాటుకు గురై మహిళా కౌలు రైతు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం జంగాలపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ అవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు... రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యంపాటి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతులు గడిచిన ఐదేళ్ల నుంచి జంగాలపల్లె గ్రామంలో నివాసం ఉంటూ కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. తమ పొలంలో పనులు లేనపుడు కూలీకి వెళ్తుంటారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన కోటంరాజు పొలంలో మిరపకాయలు కోసేందుకు 20 మంది కూలీల బృందంలో విజయలక్ష్మి వెళ్లింది. 11 గంటల సమయంలో పాము ఎడమ కాలికి కాటేసింది. ఆమె పెద్దగా కేకలు వేయటంతో తోటి కూలీలు, రైతులు హుటాహుటిన ఆటోలో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం విప్పర్లరెడ్డిపాలెంకు తరలించారు. మృతురాలి భర్త శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

906 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

- రైస్ మిల్లులో భారీమొత్తంలో పీడీఎస్ బియ్యం నిల్వలు
- విజిలెన్స్ అధికారుల తనిఖీలు



నకరికల్లులోని చల్లగుండ్ల వద్ద రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నకరికల్లు: ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పల్నాడు జిల్లా నకరికల్లులోని చల్లగుండ్ల వద్ద గల వనదుర్గ రైస్‌మిల్లు లీజ్‌కు తీసుకొని అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రికార్డులు తనిఖీచేయగా 125.83 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం మిల్లు లీజుదారుడు టి.శ్రీనివాసరావును విచారణ చేసి విషయం రాబట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజాపంపిణీ బియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మిల్లులోని 906క్వింటాల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 6ఏ కేసునమోదు చేశామన్నారు. మిల్లు లీజుదారునిపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు సంబంధితశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సీఐ ఎ.శ్రీహరిరావు, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు

మార్టూరు: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని, వాటి బారిన పడకుండా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో పలు కళాశాలల విద్యార్థులకు గురువారం సాయంత్రం నిర్వహించిన సంకల్ప అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకాశమే హద్దుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే నేటి యువతకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలను, సౌకర్యాలను కల్పిస్తుందని విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని ఎదిగేందుకు కృషి చేయాలే తప్ప మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఆయన హితవు పలికారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తరగతి గదిలోను తల్లిదండ్రులు ఇంటి వద్ద వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం ద్వారా యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడవచ్చన్నారు. అవసరమైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించటం ద్వారా విద్యార్థులను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్టూరు సీఐ ఎస్కే టీ ఫిరోజ్, ఎస్సై కమలాకర్, వీరగంధం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మచౌదరి, హర్షిణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, పర్చూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అకడమిక్ ఎగ్జిబిషన్‌లో నూతన ఆవిష్కరణలు

- అబ్బురపరచిన ప్రదర్శనలు
- ప్రతిబింబించిన సామాజిక,శాస్త్ర, సాంకేతికత
- కళాశాలలు, పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరు
- ఆసక్తిగా వీక్షించిన సందర్శకులు
- ప్రత్యేక ఆకర్షణగా వాట్సాప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీకాంటెస్ట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కొనసాగుతున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌లో రెండో రోజైన గురువారం పలు ప్రదర్శనలు విజ్ఞానం, వినూత్నాన్ని పంచాయి. సోషల్ సైన్సెస్, సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ రంగాలకు చెందిన విద్య, పరిశోధనా విభాగాలు 180 స్టాల్స్‌లో 850కిపైగా విభిన్న అంశాలపై ప్రదర్శలు, ఆవిష్కరణలు చేశాయి. సామాజికాభివృద్ధి, చరిత్ర, సంస్కృతి, కళలు, శాస్త్ర, సాంకేతిక, పర్యాటక, ఆరోగ్య పరిరక్షణ, వ్యాయామం, శారీరక దారుఢ్యం, న్యాయ సలహాలు, తదితర అంశాలపై ప్రదర్శనలు సందేశాత్మకంగా సాగాయి. పలు విభాగాల ప్రదర్శనలు ఆహ్లాదాన్ని, ఆరోగ్య పరిరక్షణను చాటుగా పలు విభాగాల ప్రదర్శలు విద్యార్థులు, సందర్శకుల్లో మేధస్సును పెంపొందించాయి. విద్య, పరిశోధనాంశాల ఆవశ్యకత, ఫార్మసీ రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలు, అంతరిక్ష ప్రయోగాలు, పచ్చదనం పరిరక్షణ, సహజవనరుల సద్వినియోగం అంశాల వంటి సామాజిక బాధ్యతను వివరిస్తూ చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. వీటితోపాటు చరిత్ర, జాతీయ నాయకుల జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేసే ప్రదర్శనలు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంకేతిక ప్రదర్శనలు

, అకడమిక్ ఎగ్జిబిషన్‌లో ఎకో టూరిజం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని పలు ప్రాంతాలలో ఉన్న పర్యాటక ప్రాంతాలు, అక్కడ ఉన్న వసతులు, ప్రత్యేకతలు తెలిపే డిజిటల టూరిజం,పీఎస్ఎల్‌వీ మిస్సైల్స్ వంటి అంతరిక్ష ప్రయోగాలు, డిజిటల్ కమ్యూనికేషన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పరిజ్ఞానం, మన సంస్కృతి, సాంప్రదాయాలు, పురాతన ఆలయాలు, గ్రీకుల కాలం నాటి కట్టడాలు వినూత్నంగా సాగాయి. వీటితోపాటు ఆరోగ్యం ఆవశ్యకతను తెలియజేస్తూ సీపీఆర్, యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటి, సంస్కృతిలో భాగమైన తోలుబొమ్మలాట, పలు అంశాలపై న్యాయసలహాలు ఏ విధంగా పొందాలనే అంశాలు వివరించారు.



6 భాషలను నేర్పుతున్న బౌద్ధ మతస్తులు

భారీగా సందర్శకులు హాజరు

రెండు రోజులపాటు జరిగిన అకడమిక్ ఎగ్జిబిషన్‌ను 15,800 మందికిపైగా విద్యార్థులు, సందర్శకులు వీక్షించారని ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్ ఆచార్య కె మధుబాబు, డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య తెలిపారు. వీరిలో 18 పాఠశాలలు, 7 కళాశాలు ఉన్నాయన్నారు. రెండోరోజు ప్రదర్శనలను వీసీ ఆచార్య పి రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, పలువురు యూనివర్సిటీ అధికారులు సందర్శించి సందర్శకుల జాబితాలలో తమ అభిప్రాయాలు రాశారు.

ప్రత్యేక ఆకర్షణగా వాట్సాప్ క్విజ్

ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ డెస్క్ నిర్వహిస్తున్న వాట్సాప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీ కాంటెస్ట్, స్లోగన్ కాంపిటీషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి గంటకు మైక్ ద్వారా ఒక ప్రశ్నను చెప్పి దానికి జవాబును నిర్వాహకుల వాట్సాప్‌కు పంపమని సూచిస్తున్నారు. గంట తరువాత సరైన జవాబులు పంపిన వారిలో లక్కీడీప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి గంటగంటకూ బహుమతులు అందజేస్తున్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ శుక్రవారంతో ముగియనుంది. ముగింపు సభకు హైదరాబాద్ డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేస్తారు.

మహోన్నతుడు పొట్టి శ్రీరాములు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించిన ఎస్పీ



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆత్మార్పణ చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీ రాములు అని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి కొనియాడారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీస్ అధికారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను చాటిచెప్పిన భవదీయుడన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడన్నారు. శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వతంత్రం సాధించవచ్చునని గాంధీజీ అన్నమాటలు శ్రీరాములు గారి అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయభాస్కరరావు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు భక్తవత్సలరెడ్డి, అశోక్ కుమార్, ఆర్ఐ రవికిరణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఐదు ఆస్పత్రులకు జరిమానా

జిల్లా డిసిప్లేనరీ కమిటీ సమావేశంలో నిర్ణయం



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ఉచితంగా చేయాల్సిన ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు పేషెంట్ల వద్ద నుంచి డబ్బులు వసూలుచేసిన ఐదు ఆసుపత్రుల యాజమాన్యాలకు జిల్లా డిసిప్లేనరీ కమిటీ జరిమానా విధించింది. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా డిసిప్లేనరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 171 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారించారు. అందులో 162 ఏఎస్ఎం మొబైల్ యాప్ సమస్యలు, ఐవీఆర్ఎస్ ఓట్‌బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన తొమ్మిది సమస్యలను విచారణ చేసి డబ్బు వసూలు చేసిన ఐదు హాస్పిటల్స్‌కి జరిమానా విధించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ డాక్టర్ వినీల, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ప్రభుత్వాసుపత్రుల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఐ అండ్ పీఆర్ డీడీ దీప్తి పాల్గొన్నారు.

ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి



జిల్లా వైద్యశాఖ అధికారులు డాక్టర్ శోభారాణి, డాక్టర్ భువనేశ్వరి తదితరులు

నరసరావుపేట: నలభైఏళ్లు పైబడిన వారందరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకొని నీటి కాసుల నుంచి కళ్లను కాపాడుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గురువారం ప్రపంచ నీటికాసుల వ్యాధి అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ నీటికాసుల వలన కంటి నరం దెబ్బతిని కంటి ప్రక్క చూపు కనపడదని, కంటి నరం పాడైపోతే చికిత్స లేదని, తదనంతరం అంధులుగా జీవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ పల్నాడు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఏ.భువనేశ్వరి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి పరీక్షలు చేస్తున్నారని, అనుమానం ఉన్న వారు దగ్గరలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటికాసుల పరీక్షలు చేయించుకొని కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డాక్టర్ డి.నాగపద్మజ, స్వర్ణలత, రామకృష్ణ, మురళీకృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

14 గ్రానైట్ లారీల పట్టివేత



కారెంపూడి: అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న 14 లారీలను పట్టుకుని వాటిని తగు చర్యల నిమిత్తం దాచేపల్లి మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అప్పగించామని ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కారెంపూడి సమీపంలోని శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద, కారెంపూడిలో, మాచర్ల సాగర్ రోడ్డులో బుధవారం రాత్రంతా నిఘా పెట్టి అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుకున్న వాటిలో 13 లారీలలోని గ్రానైట్‌కు మైనింగ్ ట్రాన్సిట్ పాసులు లేవని, మరో లారీకి ఈ వే బిల్లు లేకుండా వెళ్తున్నాయని పేర్కొన్నారు. గ్రానైట్ లారీలు ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి కారెంపూడి మీదగా ఏ విధమైన బిల్లులు లేకుండా హైదరాబాదు, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతున్నాయని అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి ఈ గ్రానైట్ లారీలను పట్టుకున్నామని పేర్కొన్నారు. అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ రకాలలో బ్లాక్, పెర్ల్ గ్రానైట్, గాలక్సీ గ్రానైట్, కలర్ గ్రానైట్‌లు ఉన్నాయని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ టి లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కె మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.